క్లుప్తంగా

ఫొటోగ్రాఫర్‌కు అవార్డు

ఖమ్మంరూరల్: కేరళ రాష్ట్రంలోని అలెప్పిలో ఇటీవల నిర్వహించిన ఫొటోగ్రఫీ వర్క్‌షాప్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు. ఈమేరకు మండలంలోని ఆరెంపులకు చెందిన మోత్కూరి అశోక్‌కుమార్ ప్రతిభ చాటి కన్సోలేషన్ బహుమతి గెలుచుకున్నాడు. ఆయనను మండల వాసులు, ఫొటోగ్రాఫర్లు అభినందించారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు



రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఖమ్మంరూరల్: మండలంలోని జలగంగనర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం డాక్టర్ శ్రీదేవి రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుత సీజన్‌లో విష జ్వరాలు ప్రబలుతున్నాయని, ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కాచి వడబోసి నీటినే తాగాలని, ఇంటి పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం. శ్యాంసన్, రూబీ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



తనిఖీ చేస్తున్న పోలీస్ అధికారులు

రఘునాథపాలెం: రఘునాథపాలెం క్రాస్ రోడ్డు వద్ద బుధవారం ఉదయం మండల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి కస్తాల సత్యనారాయణ ఆధ్వర్యాన వాహనాల తనిఖీ చేపట్టారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యాన ఎటువంటి అవకతవకలు జరగకుండా అన్ని వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పెద్ద మొత్తంలో నగదు తరలింపు, మద్యం సరఫరా వంటివి జరగకుండా చూస్తున్నట్లు కస్తాల తెలిపారు.

డివైడర్‌ను ఢీకొట్టిన లారీ..

నేలకొండపల్లి: మండలం కేంద్రంలో కోదాడ నుంచి ఖమ్మం వెళ్తున్న ఓ లారీ పెట్రోల్ బంక్ సెంటర్ వద్ద ఉన్న డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. అదే సమయాన అటుగా వెళ్తున్న ప్రయాణికులు రెప్పపాటులో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. లేకుంటే పెను ప్రమాదం జరిగేదని స్థానికులు వాపోయారు. కాగా, ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్‌కు స్వల్పగాయాలయ్యాయి. వీరిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్



బాధ్యతలు స్వీకరిస్తున్న సుధాకర్

కామేపల్లి: జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన సీహెచ్.సుధాకర్ పదోన్నతిపై కామేపల్లి తహసీల్దార్‌గా నియమితులయ్యారు. కాగా, బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించగా.. ఇక్కడ ఇన్‌చార్జ్ తహసీల్దార్ పనిచేసిన డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మి కారేపల్లికి బదిలీ కాబడ్డారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది సుధాకర్‌కు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో ఘనంగా సన్మానించారు.

నగరంలో సినిమాలు

తిరుమల	స్కంద
వినోద	చిన్నా 800
సాయిరాం	మామా మశ్చీంద్ర
ఆదిత్య	మ్యాడ్
శ్రీనివాస	చంద్రముఖి 2
సుందర్	రూల్స్ రంజన్

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	20	బచ్చలికూర	2
వంకాయ	40		10
బెండకాయ	20	పాలకూర	3
పచ్చిమిర్చి	30		20
కాకర	36	చుక్కకూర	3
బోడ కాకర	90		20
బీర	36	తోటకూర	3
దొండ	28		20
పొట్లకాయ	36	గోంగూర	2
చిక్కుడు	76		10
గోరుచిక్కుడు	40	మెంతికూర	3
క్యాబేజీ	20		10
క్యాలీఫ్లవర్	40	కొత్తిమీర	1
ఆలుగడ్డ	26		20
చామగడ్డ	48	పుదీన	1
క్యారెట్	36		20
క్యాప్సికం	60	-ఖమ్మం వ్యవసాయం	

దర్జాగా దాబాల దందా..!

విచ్చలవిడిగా మద్యపానం
- నిబంధనలకు విరుద్ధంగా వెలుస్తున్న వైన్స్‌లు, దాబాలు
- మద్యం మత్తులో ప్రమాదాలకు గురవుతున్న పలువురు..
- పట్టించుకోని పోలీస్ యంత్రాంగం



ఖమ్మం-సూర్యాపేట రోడ్డు పక్కన వెలసిన ఓ బెల్టు దుకాణం వద్ద రద్దీ

రాష్ట్ర, జాతీయ రహదారులపై వాహనాలు తూలుతూ వెళ్తున్నాయి. ఆయా రహదారుల వెంట నిబంధనలకు విరుద్ధంగా వెలుస్తున్న దాబాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు, సిట్టింగ్‌లు నడుస్తున్నాయి. అదే విధంగా రహదారుల వెంట వైన్స్‌లు కూడా అనుమతులు లేకుండా వెలిశాయి. జాతీయ, రాష్ట్ర రహదారులకు కిలోమీటర్ దూరంలో వైన్స్‌లు, బార్లు ఏర్పాటు చేయాలన్న నిబంధనలకు నీళ్లొదలడంతో రహదారుల పక్కన మద్యం ఏరులై పారుతోంది. ఫలితంగా ప్రమాదాలతో రోడ్లు రక్తసిక్తమవుతున్నాయి.

ఖమ్మంరూరల్: జిల్లాలో జరుగుతున్న ప్రమాదాల్లో అధికంగా మద్యం మత్తులో జరుగుతున్నవే ఉన్నాయని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. హైవేల పక్కన బార్లు, వైన్స్‌లు, బెల్ట్‌షాపులు విచ్చలవిడిగా వెలిశాయి. నిబంధనలకు విరుద్ధంగా దాబాలు, హోటళ్లలో మద్యం అమ్మకాలు, బయట నుంచి మద్యం తెచ్చుకొని సిట్టింగ్‌లు వేయడం కూడా యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. దీంతో లారీలతో పాటు ఇతర వాహనాల డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఈవిషయాలన్నీ తెలిసినప్పటికీ ఎక్సైజ్, పోలీస్ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో ఎవరికీ అర్థం కావడంలేదనే ఆరోపణలున్నాయి. డ్రంక్ అండ్ డ్రైవ్ కింద ప్రతీ ఏటా కేసులు నమోదు చేస్తున్నారే తప్ప.. దాబాలు, మద్యం దుకాణాలు, వైన్స్‌లపై చర్యలు తీసుకున్న దాఖలాలు శూన్యం. రహదారుల్లో వెళుతున్న వాహనదారులను బ్రీత్ ఎనలైజర్స్ పెట్టి తనిఖీలు చేయడంలేదని దీంతో వాహనదారులు ఫుల్‌గా మద్యం సేవించి వాహనాలు నడుపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అతివేగంగా నడిపే వాహనాల ను గుర్తించే సెన్సార్లు ఒకటి అర మాత్రమే ఉండడంతో వాహనాల వేగాన్ని నియంత్రించలేకపోతున్నారని తెలుస్తోంది. హైవేలపై హెల్మెట్, సీటు బెల్ట్ ధరించకుండా వాహనాలను నడిపే వారిని గుర్తించి తగు చర్యలు తీసుకోవడంలేదనే ఆరోపణలున్నాయి.



ఓ దాబాలో మద్యం సిట్టింగ్

పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న దుకాణాలు..

ఖమ్మం రూరల్ మండలం పెదతండా నుంచి జిల్లా సరిహద్దు నాయకన్‌గూడెం వరకు రోడ్డు పక్కనే కనీసం వంద వరకు బెల్ట్ షాపులున్నాయి. కూసుమంచి మండల కేంద్రంలో ఖమ్మం సూర్యాపేట రహదారి పక్కనే ఓ వైన్ షాప్ వెలిసినా అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలున్నాయి. వరంగల్ క్రాస్‌రోడ్‌లో ప్రధాన రహదారి పక్కన, ఆలయానికి వంద అడుగుల దూరంలోనే బార్‌షాప్ ఉండడం గమనార్హం. ఏది ఏమైనా రోడ్డు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్న దాబాలు, హోటళ్లు, బెల్ట్ షాపులు, వైన్స్‌లలో మద్యం అమ్మకాలను నియంత్రించాలని పలువురు కోరుతున్నారు.

విచ్చల విడిగా అమ్మకాలు..

పాలేరు నియోజకవర్గంలో ఖమ్మం రూరల్ మండలం కోదాడ క్రాస్‌రోడ్, ఏదులాపురం క్రాస్‌రోడ్, పల్లెగూడెం ఏరియా, పాలేరు రిజర్వాయర్ పక్కన వందల కొద్ది దాబాలు వెలిశాయి. నిబంధనలకు విరుద్ధంగా ఉదయం నుంచి రాత్రి ఒంటి గంట వరకూ దాబాలు, హోటళ్లు తెరిచే ఉంచుతున్నారు. అదనుగా తినుబండారాలు సైతం అందుబాటులో ఉంచడంతో రహదారిపై వెళ్లే వాహనదారులు మద్యం సేవించి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇలా ఈఏడాదిలో ఒక్క రూరల్ మండలంలోనే మద్యం సేవించి ప్రమాదాలకు గురై 20మంది వరకు మృత్యువాత పడ్డారు. అయితే ఇవన్నీ పోలీస్ రికార్డుల్లో మాత్రం మామూలు ప్రమాదాలుగానే ఉంటున్నాయి.

పత్తికి మద్దతు ధర ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: క్వింటా పత్తికి రూ.18 వేల మద్దతు ధర నిర్ణయించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని అఖిల భారత ప్రగతి శీల రైతు సంఘం(ఏఐపీకేఎస్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మలీదు నాగేశ్వరావు, ఆవుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. క్వింటా పత్తి ఉత్పత్తికి రూ.11 వేలు ఖర్చవుతుంటే కేంద్ర ప్రభుత్వం రూ.7,020 లు మాత్రమే మద్దతు ధర నిర్ణయించిందని, ఆ ధరకు కూడా మార్కెట్‌లో కొనుగోలు చేయడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ప్రకటించి రూ.18 వేల చొప్పున పత్తి కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. రైతు రుణమాఫీ ప్రకటించినా.. నేటికీ రైతుల ఖాతాల్లో నగదు జమ కాకపోవడంతో రైతులు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోందని పేర్కొన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా నాయకులు పాశం అప్పారావు, మారుతి మల్లయ్య, కేళోత్ లక్ష్మణ్, దేవలా, డి.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని సన్మానించిన బీజేపీ నాయకులు



కేంద్ర మంత్రిని సన్మానిస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: సత్తుపల్లి పర్యటనకు వెళ్తున్న కేంద్ర ఈశాన్య ప్రాంత అభివృద్ధి, సహకార శాఖ సహాయ మంత్రి బీఎల్.వర్మను బుధవారం ఖమ్మంలో బీజేపీ నాయకులు సన్మానించారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ శీలం పాపారావు ఆధ్వర్యాన ఆయనను సన్మానించగా పలువురు నాయకులు పాల్గొన్నారు. కాగా, ఖమ్మంకు చెందిన సేవా చిట్‌ఫండ్ అధినేత నల్లమల్ల పూర్ణ చంద్రరావు సతీమణి లలితమ్మ బుధవారం మృతి చెందగా కేంద్ర మంత్రి బీ.ఎల్.వర్మ నివాళులర్పించారు. ఈకార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణతో పాటు నాయకులు శ్యాం రాథోడ్, రుద్ర ప్రదీప్, నున్నా రవికుమార్, అల్లిక అంజయ్య, నెల్లూరి కోటేశ్వరావు, వీరూగౌడ్, విజయరెడ్డి, నరేష్, ఉపేందర్‌గౌడ్, చావా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల బారిన పడకుండా వైద్య శిబిరాలు



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కామేపల్లి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చందన పేర్కొన్నారు. బుధవారం కొత్తలింగాల గ్రామంలో పీహెచ్‌సీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. గ్రామాల్లో జ్వర పీడితులు ఉంటే వెంటనే పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం సక్కుబాయి, సునీత, ఆశాలు పాల్గొన్నారు.

టీకా, పోషకాహారంపై అవగాహన



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న వ్యాక్సినేషన్ మేనేజర్ రమణ

ఖమ్మంరూరల్: మండలంలోని ఎంవెంకటాయపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం నిర్వహించిన మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమాన్ని జిల్లా వ్యాక్సినేషన్ మేనేజర్ సీహెచ్.రమణ పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు టీకాలు, పోషకాహారంపై అవగాహన కల్పించారు. నూరుశాతం టీకా లక్ష్యసాధన దిశగా సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈఓ శ్రీరాములు, ఏఎన్‌ఎంలు దేవగురుభయ్, శాంతకుమారి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలను నిరసిస్తూ రైతుల ఆందోళన



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న రైతులు

తిరుమలాయపాలెం: గత కొద్ది రోజులుగా సమయపాలన లేకుండా విద్యుత్ కోతలు విధిస్తుండడంతో రైతులు ఆందోళనకు దిగారు. బుధవారం మండలంలోని బచ్చోడు పరిసర గ్రామాల రైతులు బచ్చోడు విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో వరి, పత్తి, మిర్చి పంటలకు నీటి తడులు పెట్టేందుకు వెళ్తే.. గంటలో మూడు, నాలుగుసార్లు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. అంతేకాక గంటల కొద్ది విద్యుత్ రాకపోవడంతో నీటి తడులు ఎలా పెట్టాలని చెప్పాలంటూ నినదించారు. ఇలానే విద్యుత్ అందిస్తే తమ పంటలను ఎలా కాపాడుకోవాలని ప్రశ్నించారు. విద్యుత్ కోతలు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరించారు. విద్యుత్ అధికారుల హామీతో ఆందోళన విరమించారు.

‘ఉపాధి’కి సమగ్ర చట్టం తేవాలి



రఘునాథపాలెం: డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు



నేలకొండపల్లి: సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందిస్తున్న సంఘం నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్/ రఘునాథపాలెం/ నేలకొండపల్లి: వ్యవసాయ కార్మికుల పోరాట ఫలితంగా ప్రారంభమైన మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి పథకానికి సమగ్ర చట్టం తేవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కే.వీ.రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఖమ్మం కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేసిన సందర్భంగా వెంకటేశ్వరరావు, నేలకొండపల్లి మండల పరిషత్ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం సమర్పించిన సందర్భంగా కే.వీ.రెడ్డి, రఘునాథపాలెం డిప్యూటీ తహసీల్దార్ మురళీకృష్ణకు సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చిన సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. బీజేపీ పాలనలో ఉపాధి హామీ పథకాన్ని నీరుగారుస్తుందని, బడ్జెట్ తగ్గిస్తుందని అన్నారు. బడ్జెట్‌లో పథకానికి నిధులు పెంచాలని, రోజుకు కూలీ వేతనం రూ.600 ఇవ్వడంతో పాటు 200 రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ, రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, జిల్లా నాయకులు ఎస్.నవీన్ రెడ్డి, ఎస్.కె ఇమామ్, కూచిపూడి నరేష్, అబ్దుల్ సంఘం నాయకులు దుగ్గి నరసింహారావు, పెద్దపాక నారాయణ, ఎం.లక్ష్మి, రమాదేవి, స్వామి, మల్లిఖార్జున్‌రావు, పెద్దపాక మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తిమ్మక్కపేటలో ఉచిత పశువైద్య శిబిరం



పశువైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు

తిరుమలాయపాలెం: మండలంలోని తిమ్మక్కపేట గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ వైరా ఆధ్వర్యాన బుధవారం ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మండల పశువైద్యాధికారి అనూష, సర్పంచ్ చుంచు రాములు ప్రారంభించాక గర్భకోశ వ్యాధి నివారణ, దూడలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటేశ్వర్లు గోపాల మిత్రలు చుంచు మదార్, మట్టి చిన్న వీరబాబు, ఎస్.నారాయణ, దరిపల్లి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది మృతికి సంతాపం



శరత్‌చంద్ర చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

ఖమ్మం లీగల్: నగరానికి చెందిన సీనియర్ న్యాయవాది అన్నసముద్రం శరత్‌చంద్ర(75) మంగళవారం గుండెపోటుతో మరణించారు. పూణెలో నివసిస్తున్న ఆయన కుమారుడు, కుమార్తె వద్దకు వెళ్లి అక్కడ గుండెపోటుకు గురై తుదిశ్వాస విడిచారు. ఆయన అకాల మరణం బాధాకరమని బార్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావు, బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ అన్నారు. ఆయన మృతికి సంతాపంగా బుధవారం న్యాయవాదులందరూ ఖమ్మం కోర్టులో విధులు బహిష్కరించి సంతాపం ప్రకటించారు.

రాంరెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలి

ఖమ్మంరూరల్: కాంగ్రెస్ పార్టీ కోసం జీవిత కాలం పని చేసిన రాంరెడ్డి వెంకటరెడ్డి ఆశయ సాధనకు కార్యకర్తలు కృషి చేయాలని జిల్లా కాంగ్రెస్ నాయకుడు రాంరెడ్డి చరణ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని సత్యనారాయణపురంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు.అనంతరం రాంరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, నాయకులు మానుకొండ రాధాకిషోర్‌తో పాటు నంద్యాల రవీందర్‌రెడ్డి, ఎరసాని శివశంకర్‌రెడ్డి, బైరు హరినాథ్‌బాబు, బోడా వెంకన్న, కందుకూరి వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు బహుమతులు ప్రదానం



బహుమతులు అందజేస్తున్న పుల్లయ్య

కూసుమంచి: మండలంలోని కస్తూర్బా విద్యాలయలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈనేపథ్యాన ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన చైర్మన్ పరిశ పుల్లయ్య బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ అజితకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘ట్రైనిటాట్స్’లో బతుకమ్మ సంబరాలు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ట్రైనిటాట్స్ పాఠశాలలో బతుకమ్మ పండుగను పురస్కరించుకొని బుధవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ శెట్టి భాస్కర్ బతుకమ్మ పండుగ ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సబిత, సంధ్య, మంజుల, నాగమణి, జ్యోతిశ్రీ, అలేఖ్య పాల్గొన్నారు.

సీఎం బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన

కూసుమంచి: ఈనెల 27న పాలేరు నియోజకవర్గంలో సీఎం కేసీఆర్ పాల్గొనే ఎన్నికల ప్రచార బహిరంగ సభ ఏర్పాట్లను ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి సూచనతో బుధవారం బీఆర్‌ఎస్ నాయకులు పరిశీలించారు. మండలంలోని జీళ్ల చెరువు గ్రామ పరిధిలో ఉన్న ఓ వెంచర్‌ను నాయకులు పరిశీలించి వేదికకు అనువుగా ఉన్నట్లు నిర్ణయించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీలు బానోత్ శ్రీనివాస్‌నాయక్, బోడ మంగీలాల్, డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు వేముల వీరయ్య, బెల్లం వేణుగోపాల్, ఉన్నం బ్రహ్మయ్య, నాయకులు మల్లీడు వెంకటేశ్వర్లు, ఆసిఫ్‌పాషా, చాట్ల పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అంతంతే..!

ఎన్నికల కోడ్ అమలును అధికారులు పాటించేందుకు ఎన్నికల సంఘం నియమ, నిబంధలతో పాటు అవసరమయ్యే నిధులను సమకూరుస్తుంది. అయితే విగ్రహాలకు క్లాత్‌లు కప్పే అంశంలో మాత్రం నిబంధనలు సక్రమంగా పాటించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని విగ్రహాలను తెల్లబట్టతో పూర్తిగా మూసివేయగా.. మరికొన్ని విగ్రహాలను మాత్రం ఇదిగో ఇలా అరకొరగా ఉల్లిగడ్డ బస్తాలు, మరికొన్నింటికి గోనెసంచులు కప్పారు. దీంతో వాటిని చూసిన జనం విమర్శిస్తున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్



ట్రంక్ రోడ్డులో ఉల్లిగడ్డ బస్తాలు, కవర్‌తో విగ్రహాన్ని కప్పిన దృశ్యం



మయూరిసెంటర్‌లోని రాజీవ్ గాంధీ విగ్రహంపై గోనెసంచి ఇలా



కాల్వొడ్డులోని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని మూసిన దృశ్యం

అటెన్షన్ ప్లీజ్

ఎంసీహెచ్‌లో లీకులు..!



ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలోని మాతా,శిశు ఆరోగ్య కేంద్రం భవనంలో లీకుల సమస్య వెంటాడుతోంది. భవనంలోని పైన ఉన్న రెండు అంతస్తుల నుంచి మరుగుదొడ్లకు సంబంధించిన వాడకం నీరు ఇదిగో ఇలా లీకవుతూ దుర్వాసనను వెదజల్లుతోంది. ఈ మురుగు నీరంతా ఎంసీహెచ్ భవనం ఎదుట ప్రవహిస్తున్నా.. నేటికి ఏ అధికారి పట్టించుకున్న పాపానపోలేదు. నిత్యం వందలాది మంది చిన్నారులు, గర్భిణులు వైద్య సేవలకు వస్తుండడంతో పాటు ప్రసవాలు కూడా పదుల సంఖ్యలో జరుగుతుంటాయి. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న ఆస్పత్రిలో ఇక నుంచి అయినా లీకుల లేకుండా అధికారులు చూడాలని బాధితులు కోరుతున్నారు.

- ఖమ్మం వైద్యవిభాగం